క్లుప్తంగా

బిక్కవోలు తహసీల్దార్‌గా కన్యాకుమారి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు నూతన తహసీల్దార్‌గా కన్యాకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి బదిలీపై వచ్చిన ఆమెకు స్థానిక రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీటీ కృష్ణ, ఆర్‌ఐ నందకిషోర్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



పాత వీరంపాలెంలో రాజీనామా పత్రాలను డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేస్తున్న వలంటీర్లు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో 39 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను గురువారం స్థానిక సచివాలయం-1, సచివాలయం-2ల్లో అధికారులకు అందించారు. పాత వీరంపాలెంలో మరో 10 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలు తమపై చేస్తున్న అసత్య ఆరోపణలకు నిరసనగా ఈ రాజీనామాలు చేసినట్టు తెలిపారు. ఇకపై జగనన్నకు అండగా నిలుస్తామని ప్రకటించారు.

ముగిసిన వసంత నవరాత్రులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న వసంత నవరాత్రులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారిని అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

30న కోరుకొండ మండల సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలాధ్యక్షులు ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి అధ్యక్షతన ఈ నెల 30వ తేదీన మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.హేమసుందరరావు తెలిపారు. కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాలులో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు హాజరవుతారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఆర్వో కార్యాలయ సందర్శన

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం, అనపర్తి అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఎన్నికల పరిశీలకులుగా ఎలక్షన్ కమిషన్ నియమించిన జయ అరవింద్, నితిన్ కోటయ్యలు గురువారం అనపర్తి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ఆర్వో కార్యాలయాన్ని సందర్శించిన అధికారులు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురితో సమావేశమై ఎన్నికల నియమావళి, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన పలు చెక్‌పోస్టులను వారు పరిశీలించారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

అనపర్తి: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలి అంకమైన నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభమైంది. అయితే గురువారం ఏ ఒక్క అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయలేదని ఆర్‌ఓ కార్యాలయ అధికారులు తెలిపారు.

గోపాలపురంలో రెండు నామినేషన్లు దాఖలు

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం గోపాలపురం అసెంబ్లీ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.ఎల్.శివజ్యోతి తెలిపారు. టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు రెండు నామినేషన్ల పత్రాలను అందజేసినట్టు చెప్పారు. ఏప్రిల్ 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఆర్వో చెప్పారు.

ఎన్నికల నోటీసు ఏర్పాటు

బిక్కవోలు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం ఎన్నికల నోటీసును నోటీసు బోర్డులో ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని పంచాయతీ, సచివాలయ కార్యాలయాల వద్ద ఎన్నికల నోటీసులను ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రత్నకుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మధురపూడి: కోరుకొండ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. పశ్చిమగానుగూడెం, కోరుకొండ, జంబూపట్నం, కాపవరం, కోటి, మునగాల, రాజవరం, కణుపూరు, నర్సాపురం, గాదరాడ గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



బొమ్మూరులో అభివాదం చేస్తున్న సీఎం జగన్



సంక్షేమ సారథి కోసం ఎదురుచూపులు



జననేత ఫొటోలు తీసుకుంటూ..



దిష్టి తీస్తున్న యువతులు

మీకు తోడుగా మేమంతా సిద్ధం

- సీఎం జగన్ యాత్రకు ప్రజల నీరాజనం
- రహదారులపై జన గోదారి
- అడుగడుగునా ఆత్మీయ స్వాగతం



మోరంపూడి సెంటర్‌లో ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం జగన్



చిత్రకారుడు రమేష్ రూపొందించిన సీఎం జగన్ చిత్రంతో అభిమానులు



సీఎం జగన్‌తో జక్కంపూడి విజయలక్ష్మి, రాజా

రాజమహేంద్రవరం సిటీ/కడియం/ధవళేశ్వరం/ప్రకాశం నగర్/రాజానగరం: మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా బస్సుయాత్ర చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు గురువారం జన గోదారిలా ప్రజలు రోడ్లపైకి తరలివచ్చారు. అడుగడుగునా మద్దతు పలుకుతూ ఆయనను అనుసరించారు. సంక్షేమ ప్రదాత, ఆదర్శ పాలకుడు, ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ప్రియతమ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మేమంతా సిద్ధం అని ఎలుగెత్తి చాటారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు రోడ్లకు ఇరువైపులా నిలబడి జగన్‌కు మద్దతు పలికారు. అభిమానులు ఆయనను అనుసరించారు. ఈ సందర్భంగా నగరంలోని రోడ్లలన్నీ జన సంద్రంగా మారాయి. మండుటెండలో సైతం లెక్కచేయకుండా ఆయన కోసం ప్రజలు ఎదురు చూశారు. రాజమహేంద్రవరం రూరల్, సిటీ, రాజానగరం నియోజకవర్గాలలో యాత్ర కొనసాగించిన జగన్ అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట మండలం ఎస్టీరాజాపురం గ్రామంలో రాత్రి బస చేశారు.

మంత్రి వేణు ఆధ్వర్యంలో స్వాగతం

ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. కడియం మండలం పొట్టిలంక వద్ద గురువారం పెద్ద ఎత్తున గ్రామస్తులు స్వాగతం పలికారు. పొట్టిలంక నుంచి వేమగిరి జంక్షన్ వరకూ మండుటెండను సైతం లెక్క చేయకుండా మహిళలు, యువకులు, వృద్ధులు జాతీయ రహదారిపై జగన్ రాక కోసం ఎదురు చూశారు. పొట్టిలంక వద్ద ప్రజలకు అభివాదం చేస్తూ జగన్ కాన్వాయ్ ముందుకు సాగింది. కడియపులంక శివార్లలోని ఖాళీ స్థలంలో మధ్యాహ్న భోజన విరామానికి ఆగారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు నర్సరీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని చందన నాగేశ్వర్ ద్వారా సీఎం వద్దకు పంపించారు.

కడియపులంక పూల మార్కెట్ సెంటర్‌లో..

కడియపులంక పూలమార్కెట్ సెంటర్‌లో జగన్‌కు భారీ ఎత్తున ప్రజలు స్వాగతం పలికారు. పువ్వులు చల్లుతూ జై జగన్ నినాదాలు చేశారు. బస్సుపైకి ఎక్కి అక్కడున్న ప్రజలకు జగన్ అభివాదం చేశారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా వేమగిరి జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ పెద్ద ఎత్తున నిరీక్షిస్తున్న ప్రజలకు జగన్ బస్సుపైకి వచ్చి అభివాదం చేశారు. పార్టీ నాయకుడు గిరజాల బాబు ఎడ్లబళ్లు, వరి కంకులతో స్వాగతం పలికారు. సీఎం వెంట ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఉన్నారు. స్వాగతం పలికిన వారిలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ నాయకులు గిరజాల వీర్రాజు (బాబు), పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, కొత్తపల్లి శివాజీ, మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, పార్టీ నాయకులు గుబ్బల నాగార్జున, కట్టా జమీందారు, తోకల శ్రీనివాసరావు, తలారి వరప్రసాద్, సాధనాల శివ, పెన్నాడ జయప్రసాద్, మిరప రమేష్, సత్యం వెంకటరమణ, దేవులపల్లి సరితారాణి, చాటకాల చంటి, కడియం మండలం, ధవళేశ్వరం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ఉన్నారు. కాగా, కడియం మండలం పొట్టిలంక వద్ద కోటిపల్లి కాలువపై వంతెన నిర్మాణం త్వరితగతిన చేయాలంటూ జగన్‌కు సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు.

జనసంద్రమైన మోరంపూడి

తమ అభిమాన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు పెద్ద ఎత్తున జనం గురువారం సాయంత్రం మోరంపూడి సెంటర్‌కు తరలిరాడంతో ఆ ప్రాంతం జనసంద్రంగా మారింది. మేమంతా సిద్ధం బస్సు యాత్ర 17వ రోజు గురువారం సాయంత్రం 5.34 నిమిషాలకు మోరంపూడి సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీ, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నియోజకవర్గ పరిశీలకులు రావిపాటి రామచంద్రరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నందెపు శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్ తదితరులు ఘన స్వాగతం పలికారు. మోరంపూడి సెంటర్‌కు చుట్టూ పక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు తరలి వచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుపైకి చేరుకుని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

ఉత్సాహంగా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నగరంలో ప్రజలు నీరాజనాలు పలికారు. తీన్‌మార్ డప్పులతో స్వాగతించారు. మోరంపూడి జంక్షన్, మార్గాని ఎస్టేట్, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, షెల్టన్ హోటల్, తాడితోట జంక్షన్, బైపాస్ రోడ్డు, చర్చిపేట ఆజాద్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, ఆర్యాపురం, మూలగొయ్యి సెంటర్, సీతంపేట రామాలయం, పేపర్ మిల్లు జంక్షన్, కాతేరు రోడ్డు మీదుగా కొనసాగింది. తాడితోట జంక్షన్ వద్ద తన బిడ్డను రక్షించాలంటూ తారక రామ్ అనే చిన్నారి కుటుంబం వేడుకోవడంతో జగన్ బస్సు నుంచి కిందకు దిగారు. ఆ కుటుంబ సభ్యులను పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న పేపర్ మిల్లు కార్మికులు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వినతిపత్రం అందించారు. కార్మిక నాయకులను బస్సులోకి రప్పించి వివరాలను తెలుసుకున్నారు. .

రాజానగరం నియోజకవర్గంలో..

రాజానగరం నియోజకవర్గంలోకి ప్రవేశించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దారిపొడవునా జనం నీరాజనాలు పలికారు. జాతీయ రహదారిపై దివాన్ చెరువులో గామన్ బ్రిడ్జి సెంటర్, గ్రామ కూడలి, రాజానగరం వైఎస్సార్ జంక్షన్ లలో భారీగా చేరుకున్న జనం జేజేలు పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు వారు ప్రదర్శించిన పార్టీ జెండాలతో రహదారి కూడళ్లు కళకళలాడాయి. బస్సు పైనుంచి చేతులు ఊపుతూ జగన్ ముందుకు సాగారు.

జక్కంపూడి రాజా స్వాగతం

బస్సు యాత్ర ద్వారా నియోజకవర్గంలో ప్రవేశించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఘన స్వాగతం పలికారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో పాటు ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న బస్సులోనే ప్రయాణించారు. రాత్రికి ఏడీబీ రోడ్డులో ఎస్టీరాజాపురం వద్ద ఏర్పాటు చేసిన బసలో సీఎం జగన్ విశ్రమించారు. రాజానగరంలో వైఎస్సార్ సీపీ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిని సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. బస్సులోకి రమ్మని ఆహ్వానించారు.



ఎడ్లబండితో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న గిరజాల బాబు



మోరంపూడి సెంటర్‌లో చిన్నారుల కూచిపూడి నృత్యం



జాంపేటలో మిన్నంటిన అభిమానం



రాజానగరంలో ప్రజలకు సీఎం జగన్ అభివాదం

జగనన్న రోడ్‌షోకు భారీ ఏర్పాట్లు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సారథ్యంలో ఏర్పాట్లు
- నాలుగు మండలాల నుంచి తరలి వెళ్లనున్న పార్టీ శ్రేణులు

పెదపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం బస్సు యాత్ర శుక్రవారం అనపర్తి నియోజకవర్గంలో జరగనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. సీఎం జగన్ బస్సు యాత్ర షెడ్యూల్ ప్రకారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం, రంగంపేట మండలం ఎస్టీ రాజాపురానికి గురువారం రాత్రి 9.10 గంటలకు చేరుకుంది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలోని తేతలి వద్ద గురువారం ఉదయం ప్రారంభమైన బస్సు యాత్ర రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం నియోజకవర్గాల మీదుగా సాగి అనపర్తి నియోజకవర్గంలోని ఎస్టీ రాజాపురం గ్రామానికి చేరుకుంది. గురువారం రాత్రి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కడే బస చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించనున్న తమ అభిమాన నేతకు దారి పొడవునా అపూర్వ స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం ఎస్‌టీ రాజాపురం గ్రామంలో రోడ్ షో ప్రారంభమై ఏడీబీ రోడ్డు మీదుగా ముందుకు సాగుతూ వడిశలేరు చేరుకుంటుంది. అక్కడ మెయిన్‌రోడ్డులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొంతసేపు ప్రసంగిస్తారు. అనంతరం మండల కేంద్రమైన రంగంపేట, కోటపాడు గ్రామాల మీదుగా పెద్దాపురం నియోజకవర్గంలోకి రోడ్‌షో ప్రవేశిస్తుంది. ఆయా గ్రామాల్లోని కూడళ్లలో పార్టీ శ్రేణులు, అభిమానులు జననేత జగన్‌కు భారీగా స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. దారి పొడవునా పార్టీ జెండాలతో తోరణాలతో పాటు సీఎం జగన్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఫొటోలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు శుక్రవారం ఉదయమే జననేత రోడ్‌షోలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో ఎస్టీ రాజాపురం తరలి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్షేమ పథకాలతో తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన జననేత రోడ్‌షోలో పాల్గొనడానికి ప్రజలు ఉత్సాహం చూపిస్తున్నారు.

సీఎం జగనన్నతోనే అన్ని వర్గాలకు న్యాయం



మహేంద్రవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

– ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని మహేంద్రవాడలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఆమె వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఆమెకు మహిళలు మంగళహారతులు పట్టి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో కుల, మత, రాజకీయలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో మంచి జరిగిందని భావిస్తే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచి భారీ విజయాన్ని అందించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, పారదర్శక పాలన, మంచి పనులను చూసి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తిరిగి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, మహేంద్రవాడ, పాలమూరు, కుతుకులూరు సర్పంచ్‌లు మల్లిడి జయప్రభ, గుడాల ధనలక్ష్మి, గొల్లు హేమతులసి, ఎంపీటీసీ సబ్బెళ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పార్టీలో పలువురి చేరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, చిత్రంలో గణేష్

రాజానగరం: వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ చేసి ఓర్వలేని ప్రతిపక్షాలు అవగాహన లేకుండా అనేక వ్యాఖ్యలు చేస్తున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సీతానగరం మండలం మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, వంగలపూడి ఉపసర్పంచ్ కాండ్రేగుల ఫణి ఆ పార్టీకి రాజీనామా చేసి, తమ అనుచరులతో గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఉమ్మడి గోదావరి జిల్లాల పార్టీ కోకన్వీనర్ జక్కంపూడి గణేష్ కండువాలను మెడలో వేసి స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచే విధంగా తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రతిపక్షాల నుంచి వైఎస్సార్ సీపీలో భారీఎత్తున చేరికలు జరుగుతున్నాయన్నారు. దీనితో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే జనసేన అభ్యర్థి నియోజకవర్గంలో 24 వేల ఫేక్ ఓట్లు ఉన్నాయంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయపరమైన ఆలోచన, అవగాహన లేని వారే ఈ విధమైన ఆరోపణలు చేస్తారన్నారు.

జగన్ చేసిన మేలును ప్రచారం చేయండి

- విస్తృతంగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్ చేసిన మేలును, ఆయన ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా యువతకు పిలుపునిచ్చారు. తాడితోట సంహిత కన్వెన్షన్ హాలులో గురువారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, విద్యార్థి విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నీలి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ దాదాపు రూ.1773 కోట్లను వివిధ అభివృద్ధి పనులకు మంజూరు చేయించుకున్నామన్నారు. వాటితో పాఠశాలల భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆర్బీకేలు, సచివాలయాలు, ఓపెన్ జిమ్ లు ఇలా ఎన్నో సమకూర్చుకున్నామన్నారు. గత ప్రభుత్వంతో పోల్చితే ఏ గ్రామాన్ని తీసుకున్నా 10 నుంచి 15 రెట్లు అధికంగా మన ప్రభుత్వంలో అభివృద్ధి చేశామన్నారు. సీతానగరం ప్రధాన రహదారి నిర్మాణం, కోరుకొండలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు, కలవచర్లలో 104 ఎకరాల్లో 354 ఇండస్ట్రీలు రావడానికి వీలుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కి శంకుస్థాపన, రూ.217 కోట్లతో ప్రతి ఇంటికి గోదావరి నీటిని తాగునీటిగా అందించే పథకానికి రూపకల్పన, సీతానగరంలో మల్టీపర్పస్ స్టేడియం, క్రీడా వికాస కేంద్రం ప్రారంభం, దివాన్ చెరువులో రూ.నాలుగు కోట్లతో మరో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు, ఇరిగేషన్ వర్కులు, వివిధ డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించి ఎన్నో పనులు చేపట్టామన్నారు. ప్రతిదీ రికార్డుపరంగా చూపించడం వలన అన్నిచోట్లా తప్పకుండా చర్చ జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారానికి వినియోగించే కరపత్రంలో మొదటి పేజీలో ఏఏ పథకానికి ఎంతెంత అనే అంకెలు ఉంటాయని, వెనకాల పేజీల్లో ప్రతి పథకం గురించి సమగ్రంగా వివరాలు ఉంటాయన్నారు. పోలింగ్‌కు కేవలం 23 రోజుల సమయం మాత్రమే ఉన్నందున ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి మనం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు.

25 వరకూ నామినేషన్లకు గడువు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవచ్చని రాజానగరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ నోటిఫైడ్ తేదీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. 26న పరిశీలన జరుగుతుందని, ఉపసంహరణకు 29 వరకూ అవకాశం ఉందన్నారు. అదే రోజు పోటీలో మిగిలిన అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు. కాగా.. నామినేషన్లు స్వీకరించే మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని, గరిష్ఠంగా మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఇదిలావుండగా తొలిరోజు గురువారం ఎవ్వరూ నామినేషన్ వేయలేదు.